క్లుప్తంగా

టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన



టాలెంట్ టెస్ట్ ప్రశ్నపత్రాలు విడుదల చేస్తున్న మహేశ్వరరావు, తదితరులు

శృంగవరపుకోట: భారత జాతీయ విద్యార్థి సంఘం (ఎన్.ఎస్.యు.ఐ) ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌కె కోచింగ్ సెంటర్‌లో పదో తరగతి విద్యార్థులకు శనివారం టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ పరీక్షకు సుమారు 529 మంది విద్యార్థులు హాజరయ్యారు. వాగ్దేవి విద్యాసంస్థల అధినేత కె.మహేశ్వరరావు, పి.మణిబాబు, రామకృష్ణ, ఎన్.ఎస్.యు.ఐ రాష్ట్ర కార్యదర్శి కె.సన్యాసిపాత్రుడు ప్రశ్నపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు పరీక్షలపై ఉన్న భయాన్ని పోగొట్టి మంచి మార్కులు సాధించేందుకు ఇటువంటి పరీక్షలు ఎంతగానో దోహదపడతాయన్నారు. పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులకు తన సొంత ఖర్చులతో కోరుకున్న కళాశాలలో ఇంటర్, డిగ్రీ చదువులు చదివిస్తానని మహేశ్వరరావు అన్నారు.

ధ్యానంతోనే ప్రశాంత జీవనం



పట్టణంలో శాంతియాత్ర చేస్తున్న బ్రహ్మకుమారీలు

చీపురుపల్లి రూరల్: రాజయోగ ధ్యానంతో ప్రశాంత జీవనం సాధ్యమవుతుందని బ్రహ్మకుమారీష్ సేవా కేంద్రం ఇన్‌చార్జ్ బీకే శాంతి అన్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలో శనివారం శాంతియాత్ర, చైతన్యదేవి తిరువీధి కార్యక్రమాన్ని నిర్వహించారు. చీపురుపల్లి-పాలకొండ ప్రధాన రహదారి, లావేరు ప్రధాన రహదారిలో యాత్ర సాగింది. ఈ సందర్భంగా బీకే శాంతి మాట్లాడుతూ సర్వాత్మల తండ్రి పరమాత్మ భూమి మీద అవతరించిన గుర్తుగానే శివరాత్రి పర్వదినాన్ని జరుపుకుంటారన్నారు. ప్రస్తుత కాలంలో మనిషిని వేధిస్తున్న మానసిక రుగ్మతలు, ఒత్తిడి, అశాంతి అనేవి రాజయోగ మెడిటేషన్‌తో దూరమవుతాయన్నారు. ప్రతి ఒక్కరూ రాజయోగ ధ్యానాన్ని సాధన చేసి జీవితాన్ని ప్రశాంతంగా మార్చుకోవాలని కోరారు.

దివ్యాంగులకు దుస్తుల పంపిణీ



చిన్నారికి దుస్తులు అందజేస్తున్న ట్రస్ట్ అధ్యక్షుడు శివ, తదితరులు

కొత్తవలస: దివ్యాంగులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, వారికి చేసిన సేవ దైవ సేవ కన్నా గొప్పదని సుబ్బలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కనకాల శివ అన్నారు. మండల కేంద్రంలోని చైతన్య మానసిక దివ్యాంగుల పాఠశాలలో ఉన్న 40 మంది చిన్నారులకు బెంగుళూరుకు చెందిన విజయలక్ష్మి, సునీత, తనుజ ఆర్థిక సాయంతో సమకూర్చిన దుస్తులు, భోజనం, పండ్లు, చాకెట్లను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు శివ మాట్లాడుతూ మానసిక దివ్యాంగులకు ప్రభుత్వంతో పాటు ప్రతి ఒక్కరూ చేయూతనందించి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బోజింకి సన్యాసిరావు, ట్రస్ట్ సభ్యులు మీసాల దుర్గాప్రసాద్, వై.దుర్గాప్రసాద్, బంగారు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల కల్యాణం చేస్తున్న అర్చకులు

గుర్ల: మండల కేంద్రంలోని శివాలయంలో మహాశివరాత్రి సందర్భంగా శనివారం శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు సురేష్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కనులపండువగా శివపార్వతుల కల్యాణం జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే కోటగండ్రేడులో గ్రామ వైస్ సర్పంచ్ ముద్దాడ దినేష్‌కుమార్ 1111 కొబ్బరికాయాలతో స్వామివారికి పూజలు చేశారు.

ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు

లక్కవరపుకోట: మండల కేంద్రంలోని టీసీ హాస్టల్ జంక్షన్ వద్ద ఉన్న మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత నందమూరి తారకరామారావు విగ్రహానికి ఎట్టకేలకు ముసుగు పడింది. ప్రస్తుతం ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు వేయకపోవడంపై సాక్షి పత్రికలో శనివారం ప్రచురితమైన 'ఇది కాదా.. కోడ్ ఉల్లంఘన' వార్తకు అధికారులు స్పందించారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు వేశారు.

మమ్మేలు నీలకంఠా...



విజయనగరం టౌన్: ప్రత్యేక అలంకరణలో శివపార్వతులు



విజయనగరం టౌన్: కంటోన్మెంట్ గూడ్స్ షెడ్ శివాలయంలో పూజలు చేస్తున్న మహిళలు



విజయనగరం ఫోర్ట్: బుచ్చన్న కోనేరు ఉమాపరమేశ్వర ఆలయంలో శివుడికి పాలాభిషేకం చేస్తున్న భావన, విక్రమ్

కొలిచిన వారికి కొంగు బంగారం.. అందరి కోర్కెలు తీర్చే భోళా శంకరుడు అయిన పరమశివుడికి ప్రీతిపాత్రమైన రోజు మహాశివరాత్రి. ఈ రోజున శివయ్యకు ఉపవాస, జాగరణలతో ఎవరైతే పూజిస్తారో వారికి శుభాలు కలుగుతాయని భక్తుల నమ్మకం. విజయనగరం, నెల్లిమర్ల పట్టణాల్లోని శివాలయాలు శనివారం వేకువజాము నుంచే భక్తులతో కిటకిటలాడాయి. పలు ఆలయాల్లో శివపార్వతుల కల్యాణం కమనీయంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ,ప్రసాదాలు స్వీకరించారు. మహిళా భక్తులు తులసిమొక్కల వద్ద దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

– విజయనగరం/నెల్లిమర్ల నెట్‌వర్క్



విజయనగరం టౌన్: సింహాద్రినగర్‌లోని షిర్డీ సాయిబాబా ఆలయంలో కొలువైన ఉమామహేశ్వరునికి ప్రత్యేకపూజలు చేస్తున్న అర్చకులు రమేష్ శర్మ, సాయివిశ్వనాథశర్మ



డెంకాడ: బెటాలియన్ వద్ద ఉన్న శివాలయంలో ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



విజయనగరం టౌన్: అయ్యకోనేరులో ఉమారామలింగేశ్వరునికి పూజాధికాలు చేస్తున్న అర్చకుడు మురపాక శ్రీనివాసశర్మ



పూసపాటిరేగ: కుమిలి శివాలయం ఆవరణలో బారులు తీరిన భక్తులు



డెంకాడ: చింతలవలస ఏపీఎస్‌పీ బెటాలియన్ వద్ద ఉన్న శివాలయంలో భక్తులు

జ్ఞానజ్యోతి ప్రసాదించాలి



చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు



కమ్మ వీధిలో త్రిమూర్తి శతజయంతి ఉత్సవంలో పాల్గొన్న నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి



ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రదర్శన

• బ్రహ్మకుమారి అన్నపూర్ణ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జిల్లా జడ్జి పి.సాయి కల్యాణ్ చక్రవర్తి

విజయనగరం టౌన్: అజ్ఞానమనే చీకటి నుంచి ప్రతి ఒక్కరికీ పరమశివుడు జ్ఞానజ్యోతిని ప్రసాదించాలని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రాల జిల్లా ఇన్‌చార్జ్ బీకే అన్నపూర్ణ అన్నారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని 87వ త్రిమూర్తి శివ జయంతి మహోత్సవాలను స్థానిక ప్రదీప్‌నగర్ మెట్రో కన్వెన్షన్ హాల్‌లో శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పరమశివుడు సర్వాంతరయామని, ఆయన ఆశీస్సులు అందరిపైనా ఉండాలని ఆకాంక్షించారు. అంతకుముందు జిల్లా సెషన్స్ జడ్జి పి.సాయి కల్యాణ్ చక్రవర్తి, మాజీ ఎంపీ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి, బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అదేవిధంగా కమ్మవీధిలో శివరాత్రి ఉత్సవాల్లో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులను ఆదరించాలి



ఆహార పొట్లాలు అందజేస్తున్న అచ్చిరెడ్డి, తదితరులు

విజయనగరం: ఆకలితో అలమటిస్తున్న నిరుపేదలు, వృద్ధులను అక్కున చేర్చుకుని ఆదరించాలని లిఫ్టింగ్ హ్యాండ్స్ సేవా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ సత్తి అచ్చిరెడ్డి పిలుపునిచ్చారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక ఎస్‌వీఎన్ నగర్ పశుపతి నాథేశ్వరస్వామి ఆలయం వద్ద భిక్షాటన చేస్తున్న వృద్ధులకు ఆహారం సమకూర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏడేళ్లుగా సంస్థ ఆధ్వర్యంలో నిరాటంకంగా సేవలందిస్తున్నామన్నారు. సామాజిక సేవకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అన్నదాన ట్రస్ట్ చైర్మన్ రెయ్యి శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు. అదేవిధంగా వైష్ణవవీధి చిన్నివారి మందిరం వద్ద బీకే స్ర్కీన్స్ కుమార్ ఆధ్వర్యంలో సుమారు 200 మందికి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సూర్యనారాయణ, ఏడుకొండలు, శివాజీ, పండు, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం..



జిల్లా కేంద్రంలోని బొండాడవీధిలో గల మహా గణపతి, కామాక్షి సమేత ఏకాంబరేశ్వర స్వామి దేవాలయంలో మహా శివరాత్రి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో వీర బ్రహ్మేంద్రస్వామి కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. అర్చకుడు ఓంకారేశ్వర ఆచారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు, కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

పులకించిన పుణ్యగిరి



పుణ్యగిరి మెట్ల మార్గంలో భక్తులు

శృంగవరపుకోట: ఓం నమఃశివాయ..హరహర మహాదేవ..శంభో శంకర అంటూ భక్తజనుల శివనామస్మరణతో పుణ్యగిరి సానువులు పులకించాయి. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో పుణ్యగిరి దారులు కిక్కిరిసాయి. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పావనక్షేత్రంలో కొలువుదీరిన ఉమాకోటిలింగేశ్వరుడిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. పుట్టుధార, పార్వతీధార, ధారగంగమ్మ లోయల్లో భక్తులు పవిత్ర స్నానాలు చేశారు. పలువురు పితృదేవతలకు అపరకర్మలు చేసి, పిండప్రదాన క్రతువులు నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి కళ్యాణచక్రవర్తి, స్థానిక జూనియర్ సివిల్ జడ్జి ఎస్.వాణి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ధారగంగమ్మ, సన్యాసేశ్వరస్వామి ఆలయాలను సందర్శించారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ సింహాద్రినాయుడు నేతృత్వంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆర్టీసీ అధికారులు పుణ్యగిరి, సన్యాసయ్యపాలెం దేవాలయాల దర్శనాలకు ప్రత్యేక బస్‌లు నడుపుతున్నారు. పంచాయతీ ఆధ్వర్యంలో తాత్కాలిక చలివేంద్రాలు, మరుగుదొడ్లు, స్నానాల గదులు, ప్రధాన వీధుల్లో విద్యుత్‌దీపాలు ఏర్పాటు చేశారు. కొట్టాం పీహెచ్‌సీ సిబ్బంది వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.

మహిళలకు సువర్ణావకాశం

• డీఐసీ, కేవీఐబీ ఆధ్వర్యంలో 35 శాతం సబ్సిడీపై రుణాల మంజూరు
• కుటీర పరిశ్రమల ఏర్పాటే ధ్యేయం

నెల్లిమర్ల: స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు ప్రభుత్వం సువర్ణావకాశం అందిస్తోంది. డీఐసీ (డిస్ట్రిక్ట్ ఇండస్ట్రీస్ సెంటర్), కేవీఐబీ (ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు) ఆధ్వర్యంలో విరివిగా సబ్సిడీ రుణాలను అందజేస్తోంది. మహిళలు కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని, ఆర్థిక స్వావలంబన సాధించడమే ధ్యేయంగా ప్రభుత్వం అడుగులేస్తోంది. డీఆర్‌డీఏ, వైఎస్సార్ క్రాంతిపథం ద్వారా ఇప్పటికే జిల్లాలోని మహిళలకు విరివిగా సబ్సిడీ రుణాలు మంజూరయ్యాయి. వందల సంఖ్యలో యూనిట్లు కూడా ప్రారంభమయ్యాయి. ఆసక్తి కలిగిన మహిళలు రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సంబంధిత అధికారులు కోరుతున్నారు.

ఎవరు అర్హులు..

జిల్లా వ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల్లో సభ్యులైన మహిళలు ప్రధానమంత్రి ఎంప్లాయ్‌మెంట్ గ్యారంటీ ప్రొగ్రాం (పీఎంఈజీపీ) రుణాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుదారుల వయస్సు 18 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉండాలి. కనీస విద్యార్హత 8వ తరగతి. దరఖాస్తుదారు కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి ఉండకూడదు. ఇంటిపన్ను, కరెంటు బిల్లు, పాన్ కార్డు కలిగి ఉండాలి. గ్రామైక్య సంఘాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుదారులు తప్పనిసరిగా మంచి సిబిల్ స్కోరు కలిగి ఉండాలి.

రుణాలు మంజూరు చేసే యూనిట్లు ఇవే

వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేసే యూనిట్లు 238 వరకు అందుబాటులో ఉన్నాయి. పేపర్ ప్లేట్ల తయారీ, టెంట్ హౌస్, మిని రైస్ మిల్లు, పిండి మిల్లు, ఫొటో స్టూడియో, వత్తుల తయారీ, కుండల తయారీ, ఇటుక బట్టీల ఏర్పాటు, చెప్పులు, బూట్ల తయారీ, కెమికల్ ఇండస్ట్రీ, తదితర యూనిట్ల ఏర్పాటుకు రుణాలు మంజూరు చేస్తారు. రుణాలు మంజూరయ్యే లబ్ధిదారులు తప్పనిసరిగా యూనిట్లు ప్రారంభించాలి.

35 శాతం సబ్సిడీ

జిల్లా పరిశ్రమల కేంద్రం(డీఐసీ), ఖాదీ గ్రామీణ పరిశ్రమల బోర్డు (కేవీఐబీ) ఆధ్వర్యంలో అర్హులైన మహిళలకు కనీసం రూ. 50 వేల నుంచి 10 లక్షల రూపాయల వరకు రుణాలు మంజూరు చేస్తారు. బ్యాంక్ వడ్డీకే రుణాలు అందజేస్తారు. మంజూరు చేసే రుణాల్లో 35 శాతం వరకు సబ్సిడీగా ప్రభుత్వం అందిస్తుంది. లబ్ధిదారులు తాము తీసుకున్న రుణాలకు సంబంధించిన వాయిదాలను మూడేళ్ల పాటు సక్రమంగా చెల్లించినట్టైతే సబ్సిడీ మొత్తాన్ని విడుదల చేస్తారు.

రుణంతో ఫ్యాషన్ టెక్నాలజీ మిషన్



పై ఫోటోలో కనిపిస్తున్న మహిళ పేరు చింతలపూడి మంగమ్మ. నెల్లిమర్ల మండలం సతివాడ గ్రామానికి చెందిన ఈమె జ్యోతి స్వయం సహాయక సంఘంలో సభ్యురాలు. ఈమెకు రూ. లక్ష పీఎంఈజీపీ రుణం మంజూరైంది. ఆ రుణంతో ఫ్యాషన్ టెక్నాలజీ మిషన్ కొనుగోలు చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటోంది. ప్రభుత్వం రూ. 35 వేల సబ్సిడీ లభించింది.

పేపరు ప్లేట్ల తయారీ ..



ఈ ఫోటోలోని మహిళ పేరు కందివలస సునీల. నెల్లిమర్ల మండలం గరికపేట గ్రామానికి చెందిన ఈమె పేపరు ప్లేట్ల తయారీ కుటీర పరిశ్రమ ఏర్పాటుకు వైకేపీ ద్వారా రుణం కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీంతో రూ. లక్ష రుణం మంజూరైంది. ఆ మొత్తంతో పేపరు ప్లేట్ల తయారీ యూనిట్ ప్రారంభించారు. ప్రతి నెలా కొంత ఆదాయం పొందుతున్నారు. బ్యాంక్ మంజూరు చేసిన రుణంలో ప్రభుత్వం రూ. 35 వేలు సబ్సిడీగా అందజేసింది.

దరఖాస్తు చేసుకోవాలి



డీఐసీ, కేవీఐడీ ఆధ్వర్యంలో ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ రుణాల కోసం జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహిళలు డీఆర్‌డీఏ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. కుటీర పరిశ్రమల ఏర్పాటు ద్వారా మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయం

– ఎ. కల్యాణ చక్రవర్తి, పీడీ, డీఆర్‌డీఏ, విజయనగరం.